



కడప - రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ మార్గం

నేడు రాజంపేట
పార్లమెంట్ స్థాయి సమావేశం

● నూతన కమిటీకి ప్రతిపాదనలు

రాయచోటి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ స్థాయి విస్తృత సమావేశం సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని సుధా కన్వెన్షన్ హాలులో జరగనుంది. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు గన్ని వీరాంజనేయులు, నాగేశ్వర్‌యాదవ్ తదితరులు హాజరు కానున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరగనున్న మొదటి సమావేశం కావడంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, సభ్యులు హాజరయ్యే అవకాశం ఉంది. 14 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ పరంగా జరిగిన పలు అంశాలపై చర్చించనున్నారు. సమావేశం అనంతరం పార్లమెంటు కమిటీ, పార్లమెంటు అనుబంధ కమిటీలు, రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలను ముగ్గురు సభ్యుల కమిటీ స్వీకరిస్తుంది. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల నుంచి బూత్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర జిల్లా, పార్లమెంటు స్థాయిలో పదవులు కలిగి ఉన్న నాయకులు హాజరు కానున్నారు. ముగ్గురు సభ్యుల కమిటీ పార్లమెంటు స్థాయిలో పదవులు ఆశిస్తున్న ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది. కాగా టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడి రేసులో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు ఉన్నట్లు ఆయన వర్గీయుల ద్వారా తెలిసింది. ఇతనితో పాటు రెడ్డి, మైనార్టీ వర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు సైతం పార్లమెంటు అధ్యక్షుడి స్థానాన్ని ఆశిస్తున్నట్లు సమాచారం.

శాస్త్రోక్తంగా పవిత్రాల ప్రతిష్ఠ



పవిత్రాలు తీసుకువస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామ స్వామి వారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు పవిత్ర ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను యాగశాలకు తీసుకువచ్చి హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

అంకిశెట్టిపల్లె సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మదనపల్లె టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె సర్పంచ్ వై.శరత్‌రెడ్డి చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎ.రాధమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ మద్దతుదారుడైన శరత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై పలు ఆరోపణలు వచ్చాయి. అంకిశెట్టిపల్లె పంచాయతీకి చెందిన జె.వెంకటరమణ కలెక్టర్‌కు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో విచారించి నివేదికలు పంపారు. అంతేకాకుండా సరైన బిల్లులు, ఓచర్లు, ఎం.బుక్కులు లేకుండా రూ.24,63,335ను దుర్వినియోగం చేసినట్లు రుజువైంది. దీంతో చెక్‌పవర్‌ను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేణిగుంట-కడప

● కేంద్ర వన్యప్రాణ సంరక్షణ విభాగం అనుమతులు
● నాలుగు లేన్లుగా 122 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ● రెండేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఉత్తర్వులు

గ్రీన్ ఫీల్డ్ హైవేకే గ్రీన్ సిగ్నల్

గత కొన్నేళ్లుగా ఉమ్మడి కడప జిల్లా వాసులను ఊరిస్తున్న రేణిగుంట-కడప గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర వన్యప్రాణి సంరక్షణ శాఖ అనుమతులు ఇచ్చింది. దీంతో ఉమ్మడి కడప జిల్లాతో పాటు కర్నూలు, అనంతపురం, బళ్లారి, మహారాష్ట్ర, తెలంగాణ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. మూడేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేసినా అటవీ, వన్యప్రాణి సంరక్షణ అనుమతులు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం అనుమతులు రావడంతో పనులు ఊపందుకోనున్నాయి.



గ్రీన్‌ఫీల్డ్ హైవే నమూనా

రాజంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కడప నుంచి రేణిగుంట వరకు సుమారు 122 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3232 కోట్లను మూడేళ్ల కిందటే మంజూరు చేసింది. రెండు ప్యాకేజీలుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే అటవీ శాఖ అధికారుల అనుమతులు లేకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం హైదరాబాదు నుంచి కడపకు నాలుగు లేన్ల రోడ్డు ఉంది. దీనివల్ల తెలంగాణ, మహారాష్ట్ర, కర్నూలు, అనంతపురం వాసులు కడప వరకు సులభంగా ప్రయాణం చేస్తున్నారు. అయితే కడప నుంచి రాజంపేట, కోడూరు మీదుగా చెన్నైకి వెళ్లాలన్నా, తిరుమలకు వెళ్లాలన్నా ఎంతో కష్టతరమైన పని. ఈ రెండు లేన్ల రోడ్డులో ప్రతిరోజూ 3 వేల పైబడి వాహనాలు వెళుతుంటాయి. నిత్యం రోడ్డు ఎంతో రద్దీగా ఉండడం, ఒక వాహనాన్ని దాటి మరో వాహనం వెళ్లలేకపోవడం, ప్రయాణం పూర్తిగా ఆలస్యమవుతోంది. అంతేగాక వాహనాల రద్దీ వల్ల నిత్యం ప్రస్తుతం ఉన్న రెండు లేన్ల హైవేలో రోడ్డు ప్రమాదాలు జరగడం, ఎంతోమంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని ఇటీవల బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అటవీ అధికారులతో చర్చించి పనులు ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో వన్యప్రాణి సంరక్షణ అధికారులు పచ్చజెండా ఊపారు.

కడప నుంచి భాకరాపేట మీదుగా ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలు చేయనున్నారు. అంటే భాకరాపేట నుంచి కడప వరకు ఇప్పుడున్న రోడ్డునే నాలుగు లేన్లుగా విస్తరిస్తారు. భాకరాపేట నుంచి రైల్వేకోడూరు వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు కాకుండా రైల్వేలైను అవతల అటవీ మార్గం ద్వారా సుమారు 82 కిలోమీటర్ల మేర కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తారు. శెట్టిగుంట నుంచి రేణిగుంట వరకు ప్రస్తుతమున్న రెండు లేన్ల రహదారిని నాలుగు లేన్లుగా వేస్తారు. 122 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్ల రోడ్డును, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 54 కిలోమీటర్ల మరో రోడ్డును రెండు ప్యాకేజీలుగా ఏర్పాటు చేస్తారు. ఈ రెండు ప్యాకేజీల రోడ్డు నిర్మాణానికి లక్ష్మీ ఇన్‌ఫ్రా అనే సంస్థ టెండర్లు వేసింది. పనులు ప్రారంభించిన రెండేళ్లకే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఈ హైవేలో 55 కిలోమీటర్ల మేర 11 చోట్ల భారీ వంతెనలు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో మండలాలు, ప్రధాన గ్రామాలకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్డును కూడా వేస్తారు. రోడ్డు కిందనే బ్రిడ్జిలు, కాలువలు ఏర్పాటు చేస్తారు. బాలుపల్లె అటవీ మార్గంలో శెట్టిగుంట నుంచి బాలుపల్లె ప్రాంతంలో వన్యప్రాణులు అటు ఇటు తిరగడానికి రోడ్డు కింద మార్గాలు ఏర్పాటు చేస్తారు. ఈ జాతీయ రహదారిని 716 అని పిలుస్తారు. రహదారి వెనువెంటనే ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేస్తే ఉమ్మడి కడప జిల్లా వాసులతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, బళ్లారి వాసులకు సులభంగా ప్రయాణం జరిగి శ్రీవారి దర్శనాన్ని సులభతరం చేసుకోవడంతో పాటు చెన్నైకి కూడా త్వరితగతిన చేరుకుంటారు. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి.



ప్రస్తుతం ఉన్న డబుల్ లేన్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

శుభ పరిణామం



ప్రస్తుతం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కడప-రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం ఉమ్మడి కడపజిల్లా వాసులకు శుభ పరిణామం. ప్రస్తుతం ఈ రహదారిలో ప్రయాణం ఆలస్యమవుతూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు నిర్మాణానికి కేంద్ర మంత్రి గడ్కరీ వన్యప్రాణి సంరక్షణ విభాగం ద్వారా అనుమతులు ఇప్పించడంతో పనులు వెంటనే ప్రారంభం కానున్నాయి. జిల్లావాసులుగా మేమందరం ఆనందిస్తున్నాం. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలి

- అచ్చిగారి గోపాల్, జనసేన నాయకుడు, రాజంపేట

కేంద్ర మంత్రి గడ్కరి వల్లే...



ఇటీవల నేను బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ద్వారా కేంద్ర మంత్రి గడ్కరిని కలిసి ఈ రోడ్డు వ్యవహారంపై విజ్ఞాపన పత్రం అందజేసి చర్చించారు. ఇక్కడి ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న కేంద్ర మంత్రి వెంటనే సంబంధిత అధికారులకు పనులు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడంతో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర వన్యప్రాణి సంరక్షణ విభాగం అనుమతులు ఇచ్చింది. గత ఏడాది డిసెంబరులోనే అటవీ శాఖ అనుమతులు ఇచ్చినా వన్యప్రాణి సంరక్షణ అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం పనులు వెంటనే జరగనున్నాయి. ఇది ఎంతో శుభ సూచకం.

- సాయి లోకేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే మృతి చెందిన బొప్పాయి కార్మికురాలు
- మరో ఇరువురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన వెంకటమ్మ

రైల్వేకోడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో బొప్పాయి కార్మికురాలు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇరువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే.. మండలంలోని సూరపు రాజుపల్లె క్రాస్ రోడ్డు ప్రధానదారికి పక్కనే ఉన్న సూరపురాజు పల్లె గిరిజనకాలనీ నుంచి రైల్వేకోడూరు వైపు మోటారుసైకిల్‌లో మహేష్, వీరయ్య, వెంకటమ్మ వెళుతుండగా తిరుపతి నుంచి రైల్వేకోడూరు వైపు వెళుతున్న ఓ కారు వెనక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ (30) అక్కడికి అక్కడే మృతి చెందగా మహేష్, వీరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురూ బొప్పాయి కూలీలు. వీరు చిట్వేలి మండలం చింతల చెలిక గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరళించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కలకడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ముల్లగూరి సోమశేఖర్ (54) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగాపురం పంచాయతీ రంగప్పగారిపల్లికి చెందిన సోమశేఖర్‌కు తన చెల్లెలుతో భూ సమస్యలు వున్నట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సోమశేఖర్ శనివారం ఉదయం పొలం వద్ద విష ద్రావణం తాగి అపస్మారక స్థితిలో వుండగా గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి


హనుమంతు మృతదేహం

పీలేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో హనుమంతు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19వ తేదీన పీలేరు రైల్వే స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. కాస్త కోలుకున్నాక తనది అనంతపురం జిల్లా ఉరవకొండ అని తెలిపాడని, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9440764744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

ఉరి వేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతి చెందిన ఉమ్మడి శెట్టి లక్ష్మీప్రసాద్ ఫైల్ ఫోటో

ప్రొద్దుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శనివారం రాత్రి మేడపైన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్‌కు రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లకు చెందిన చంద్రకళా అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో వివాహమైంది. పెళ్లైన వారం రోజులకే దంపతుల మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా కాపురం వుంటున్నారు. ఇటీవల లక్ష్మీప్రసాద్‌కు కిడ్నీ సమస్య వచ్చింది. దీనికితోడు భార్య సమస్య కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాదులోని తన ఇంటిలో శనివారం రాత్రి భోజనం అయ్యాక మేడపైన నిద్రపోవడానికి వెళ్లాడు. తండ్రి వెంకటసుబ్బన్న మేడపైకి వెళ్లి చూసేసరికి తలుపులు వేసి వున్నాడు. కిటికీలో నుండి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనపడ్డాడు. దీంతో వెంటనే లక్ష్మీప్రసాద్‌ను కిందకి దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు


గాయపడిన నాగరాజు

కమలాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో స్నేహితుల మధ్య మాటామాట పెరిగి గొడవకు దారి తీసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చదిపిరాళ్ల గ్రామానికి చెందిన శివారెడ్డికి వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి రూ.4500 బాకీ ఉన్నాడు. ఆ డబ్బు సోమవారం ఇస్తానని చెప్పేందుకు ఆదివారం గోవర్ధన్‌రెడ్డి రామచంద్రాపురం వద్ద ఉన్న శివారెడ్డి ఎద్దుల షెడ్డు వద్దకు వెళ్లాడు. తనకు అవసరం ఉందని, వెంటనే బాకీ ఇవ్వాలని శివారెడ్డి కోరాడు. ఇంతలో వల్లూరు మండలం కట్ట గ్రామానికి చెందిన ఆది నాగరాజు, వినోద్, చరణ్‌తేజ్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. ఏం జరిగిందో తెలియదు... స్నేహితులైన గోవర్ధన్‌రెడ్డి, నాగరాజుల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగరాజు మెడపై కత్తి పోట్లు కావడంతో గాయాలయ్యాయి. అక్కడున్న వారు సర్దిచెప్పి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారించి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ


చోరీకి గురైన బైక్

సిద్దవటం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి బాకరాపేట ప్రాంతంలోని కాశినాయన గుడి సమీపాన ద్విచక్ర వాహనం చోరీ గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైతు వెంకటసుబ్బారెడ్డి ఆదివారం సాయంత్రం కాశినాయన గుడి సమీపాన ఉన్న తన పొలం వద్ద ద్విచక్ర వాహనం నిలిపి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం చోరీ గురైందని రైతు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా ఈ చోరీపై విచారణ చేపట్టామన్నారు.

పాత బిల్లులకు మోక్షం ఎప్పుడో..?

- కలగా మరిన పాత బిల్లుల మంజూరు
- ఏడు సంవత్సరాలుగా తెలుగు తమ్ముళ్ల ఎదురుచూపులు
- మొత్తం రూ.10 కోట్ల మేరకు పెండింగ్‌లోనే..
- బిల్లుల మంజూరు కోసం మంత్రి ప్రత్యేక చొరవ


నూలివీడులో బిల్లులకు నోచుకోని డంపింగ్ యార్డు

గాలివీడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-19 మధ్యకాలంలో గ్రామాల్లోని టీడీపీ నాయకులు లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డంపింగ్ యార్డులు, ఫార్మేషన్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, చెక్‌డ్యాంల మరమ్మతులు, కొత్త చెక్‌డ్యాంల నిర్మాణాలు కల్లాలు (పంట మార్పులు), పాఠశాలల దగ్గర ఆట స్థలాలు వంటి పనులను ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టేసింది. దీంతో అప్పులు చేసి పనులు చేసిన టీడీపీ నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఏడు సంవత్సరాలుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించుకోలేక నరక యాతన అనుభవిస్తున్నారు. టీడీపీ నాయకులు చేసిన పనులకు అప్పటి వైసీపీ నాయకులు బిల్లులు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసి బిల్లులు రాని టీడీపీ నాయకుల కోసం అప్పట్లో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లించి పనులు చేసిన వాళ్లను ఆదుకుంటామని ప్రతి మీటింగ్‌లోనూ చెబుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ బిల్లులకు మోక్షం కలగలేదు. ఒక్క నీరు-చెట్టు బిల్లులు తప్ప ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించలేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అయితే గత వారం క్రితం పెండింగ్ బిల్లులకు సంబంధించి ఒక జాబితా సీఆర్‌డీఏ నుంచి మండల స్థాయి అధికారులకు వచ్చింది. ఆ జాబితాతో కేవలం రూ.7 వేలు మాత్రమే విత్‌డ్రా అమౌంట్ వచ్చినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నాడు ఉపాధి హామీ నిధులతో రూ.10 కోట్ల మేర వివిధ రకాల అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు చేశారు. అందులో ఆగస్టులో రూ.3కోట్ల 80లక్షల పనులు చేసిన వారి అకౌంట్లలో జమ అయింది. విషయం తెలుసుకొన్న వైసీపీ నాయకులు దురుద్దేశంతో జిల్లా స్థాయి ఉపాధి అధికారులతో ఒత్తిడి చేయించి డబ్బులు పడిన వారి అకౌంట్లను డ్రా చేయనీయకుండా బ్లాక్ చేయించారు. దీంతో వీరు ఇప్పటికీ డబ్బులను డ్రా చేసుకోలేకపోయారు. మండలంలోని గాలివీడులోని ఎస్‌బీఐలో బిల్లులకు సంబంధించిన డబ్బులనే కాకుండా అంతకు ముందు ఉన్న డబ్బులను కూడా డ్రా చేసుకోలేకుండా పోతున్నామని బ్లాక్ చేసిన అకౌంట్‌దారులు వాపోతున్నారు. సీసీపల్లె పంచాయతీ నల్లగుండ్లపల్లెకు చెందిన ఒక వ్యక్తికి చెందిన అకౌంట్‌లో ఆగస్టు 2022లో రూ.2 లక్షల మేర బిల్లులు జమ కావడం జరిగిందని, వెంటనే తన అకౌంట్‌ను బ్లాక్ చేశారని, అంతకు ముందు తన అకౌంట్‌లో ఉన్న డబ్బులను కూడా ఇప్పటికీ విత్‌డ్రా చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.70 లక్షలు బిల్లులు అకౌంట్‌లో జమ కావడంతో ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయడం జరిగిందని ఎగువ గొట్టివీడుకు చెందిన మరొక బాధితుడు తెలిపారు. నూలివీడులోని ఏపీజీబీ, గాలివీడులోని ఏపీజీబీ, కార్పొరేషన్ బ్యాంకుల అకౌంట్లలో పడిన బిల్లులను మరుసటిరోజే అప్పటి జిల్లా అధికారులు తిరిగి వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని, ఆ డబ్బులను కూడా ఇంతవరకు తిరిగి అకౌంట్‌లో జమ చేయలేదని మరికొంత మంది వాపోయారు. మొత్తం 4 బ్యాంకుల్లో వంద మందికిపైన టీడీపీ వారికి సంబంధించి రూ.3 కోట్ల 80 లక్షల వరకు డ్రా చేసుకోకుండా నిలుపుదల చేశారన్నారు. ఇవేకాకుండా 2017-19 మధ్యకాలంలో డంపింగ్ యార్డు, ఫార్మేషన్ రోడ్లు, కల్లాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు వంటివి ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఐడీ నెంబర్లను, ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లను కూడా బ్లాక్‌లో పెట్టి వైసీపీ నాయకులు అడ్డుకున్నారని తెలిపారు. నూలివీడు పంచాయతీలో 2018సెప్టెంబర్‌లో డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపట్టామని, 24-12-2018 నాటికి ఆ పనులను పూర్తి చేశామని, ఈ పనికి సంబంధించి వర్క్ ఐడీ నెంబర్ 1111535004004171029 అని, ఎంబుక్ నెంబర్ 025/54 అని, ఈ పనికి సంబంధించి ఆనాడు రూ.4,56,197 ఎఫ్‌టీవోను కూడా చేశారని, కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రాలేదని మరో బాధితుడు పేర్కొన్నారు. కానీ వారం క్రితం ఈ డంపింగ్ యార్డుకు సంబంధించి కేవలం రూ.28,877 మాత్రమే నిధులను విడుదల చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పెండింగ్ బిల్లులు మండల వ్యాప్తంగా రూ.5 కోట్ల మేర ఉన్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బ్లాక్ చేసిన అకౌంట్లు తిరిగి ఓపెన్ చేయించి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించడానికి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించడానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఏది ఏమైనా పెండింగ్ బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎంపీడీవో వివరణ

మండలంలో 2017-19 మధ్యకాలంలో చేసిన కొన్ని పనులకు సంబంధించి బ్యాంకు అకౌంట్లను బ్లాక్ చేసిన మాట నిజమే నని, ఈ పనిని అప్పటి అధికారులు చేశారని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఇంకా కొన్ని పనులకు సంబంధించి ప్రభుత్వం విత్‌డ్రా అమౌంట్ వచ్చిందని, దీంతో పాటు ఇంకా కొన్ని పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వీటికి సంబంధించి సీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

ఘనంగా గోవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె సాయినేత్రికారెడ్డి, అల్లుడు దుర్గామహేశ్వరరెడ్డిల వివాహ రిసెప్షన్ ఆదివారం నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర భవనాలు, రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, మాజీ మంత్రి అంజాద్‌బాషా, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యేలు వీరశివారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం, మేడా మధుసూదన్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఉక్కు ప్రవీణ్, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, సాయినాథ్ శర్మ, టీడీపీ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు దంపతులను ఆశీర్వదించారు.

జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా

చంద్రశేఖర్‌రావు ఎన్నిక



జమ్మలమడుగు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన డి.చంద్రశేఖర్‌రావు ఆదివారం కడప జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఎన్నికయ్యారు. కడపలో జరిగిన కార్యవర్గ ఎన్నికలో తనను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆగస్టు 2023 జరిగిన కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అప్పట్లో ఎన్నిక కాగా ఈ ఆదివారం రెండవసారి ఎన్నికైనట్లు వివరించారు. ఈయన జమ్మలమడుగులో మండల విద్యాశాఖాధికారిగా ఉన్నారు. కాగా జిల్లా అధ్యక్షుడిగా జి.వి.సుబ్బారెడ్డి (బద్వేలు), కోశాధికారిగా శ్రీనివాసరెడ్డి (హెచ్‌ఎం, పెన్నానగర్, ప్రొద్దుటూరు), జమ్మలమడుగు డివిజన్ వైస్‌ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణరెడ్డి (హెచ్‌ఎం, లక్ష్మీపేట), జిల్లా జాయింట్ సెక్రటరీగా జి.బాలయ్య (హెచ్‌ఎం, వేపరాల), రాష్ట్ర కౌన్సిల్‌గా ఎస్.లక్ష్మీనారాయణరెడ్డి (జడ్పీహెచ్‌ఎస్, తొండలదిన్నె)లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసు రక్షణ కోరిన ప్రేమజంట


పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రేమజంట

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట ఆదివారం తాలుకా పోలీసులను ఆశ్రయించారు. మదనపల్లె మండలం కొత్తపల్లె గ్రామం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన హేమంత్ నాయక్, నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన గాయత్రి ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని, రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి మదనపల్లె పట్టణ శివారులోని ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. ఈ మేరకు పెద్దల నుంచి రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరూ మేజరు కావడంతో రక్షణ కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు డీడీలు కూడా చెల్లుబాటు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

మదనపల్లె టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 11 బార్లకు నిర్వహించనున్న లక్కీ డ్రాలో పాల్గొనేవారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు ఇవ్వవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తులకు, ఆన్‌లైన్‌లోనే డిపాజిట్లు, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే ఆఫ్‌లైన్ దరఖాస్తులకైతే డీడీ ద్వారా డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలకు పూర్తి చేసిన దరఖాస్తులను రాయచోటిలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందించాలని ఆయన తెలిపారు.

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ దారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కానీ అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మ : తులసిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించాలని వైసీపీ నిర్ణయించడం ద్వారా జగన్ నిజస్వరూపం మరోసారి బహిర్గతమైందని, బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మగా మారారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ చేతిలో జగన్ కీలు బొమ్మ అని మరోసారి రుజువైందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ ప్రభుత్వం బలపర్చిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టీడీపీ, జనసేన, వైసీపీ నిర్ణయించడం చాలా దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో కుస్తీ, హస్తినలో దోస్తీ అన్నట్లుగా వైసీపీ, టీడీపీల లాలూచీ వ్యవహారం ఉందన్నారు. బాబుకు ఓటేసినా, బీజేపీకి ఓటేసినట్లే, జనసేనకు ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే, జగన్ పార్టీకి ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే అనే ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, సీనియర్ నాయకుడు ఎస్ఎండీ గౌస్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్‌రఫీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరును అభివృద్ధి చేసి చూపిస్తా

- ముక్కా సమక్షంలో టీడీపీలో చేరిన 200 వైసీపీ కుటుంబాలు


ముక్కా సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని బొజ్జావారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన 200 మంది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఇప్పటికే సుమారు రూ.80 కోట్ల మేరకు వివిధ రకాల అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. రైల్వేకోడూరులో త్వరలో అన్నా క్యాంటిన్ ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిల సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. అనంతరం దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు నందలూరు సుబ్రహ్మణ్యంరెడ్డి అలియాస్ చిట్టి ఆధ్వర్యంలో 35 కుటుంబాలు, నందలూరు శ్రీనివాసులురెడ్డి, చిన్నపోలు జయరామిరెడ్డి, నందలూరు సుబ్బరామిరెడ్డి, జోగి పట్టాభిరెడ్డి, సింగమాల వెంకటరెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో 165 కుటుంబాలు ముక్కా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో డీఎస్పీ



సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలతో ఆదివారం రాయచోటి పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు కలిసి ప్రతి ఆదివారం సైక్లింగ్ అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సైక్లింగ్ అనేది కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదని, అది మన మనస్సుకు ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. అలాగే యోగా సాధన మనలోని ఏకాగ్రతను పెంచి మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎం.పెద్దయ్య, పలువురు ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి తన సొంత గ్రామానికి బ్రిడ్జి మంజూరు చేయించినా పనులు పూర్తి చేయించలేకపోయాడు. గుంజన నదిలో వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో నియోజకవర్గ కేంద్రానికి వెళ్లేందుకు చుట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో రైతులు, వ్యాపారులు, కార్మికులు, కూలీలు తదితరులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

త్రిశంకు స్వర్గంలో..

రెడ్డివారిపల్లె బ్రిడ్జి



- బిల్లులు పెట్టి ఆరు నెలలైనా విడుదల కాని నిధులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- పది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

రైల్వేకోడూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.12 కోట్లు, అప్రోచ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఏర్పాటు, భూ సేకరణ తదితరాలకు రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంతో 2023 ఫిబ్రవరిలో పనులు ప్రారంభమయ్యాయి. తీరా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బ్రిడ్జి పనులు ప్రారంభించడంతో కాంట్రాక్టర్‌ను వత్తిడికి గురి చేసినా పనులను పూర్తి చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం రాగానే బ్రిడ్జి పనులు శ్లాబు వరకు తీసుకుని వచ్చారు. అయితే, ఇంత వరకు ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ చేతు లెత్తేశాడు. దీంతో పనులు నిలిచి పోయాయి. ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి బ్రిడ్జి వరకు అప్రోచ్ రోడ్డు, అక్కడి నుంచి సర్వీస్ రోడ్లు, రక్షణగోడల నిర్మాణం తదితర పనులు చేయాల్సి ఉంది. రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిచొరవ తీసుకుని బ్రిడ్జి పనులు పూర్తిచేయించాలని రెడ్డివారిపల్లె చుట్టు పక్కల పది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ఇబ్బందులు

బ్రిడ్జి పూర్తి అయ్యేంత వరకు గుంజననదిలో వేసిన తాత్కాలిక రోడ్డు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఈ తాత్కాలిక రోడ్డులో వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని పిల్లగుట్ట కాలనీ, సత్యనారాయణ పురం, గందెద్దుల మిట్ట, ఎర్రమిట్ట, రెడ్డివారిపల్లె, త్రిమూర్తినగర్, గుర్రప్పపాళెం గిరిజన కాలనీ, చలం పాళెం, చియ్యవరం, పాటిమీది పాళెం, అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అంటున్నారు.



అధ్వాన స్థితిలో సర్వీసు రోడ్డు

బ్రిడ్జి పనులు పూర్తి చేయండి



బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి. వర్షాలు పడుతున్నాయి. వరదలు వస్తే తాత్కాలిక రోడ్డు కొట్టుకునిపోతే.. రైల్వేకోడూరుకు 10 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సివస్తుంది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

- పాశెంకోట సుబ్బమ్మ, మాజీ సర్పంచ్, రెడ్డివారిపల్లె

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఫలితం లేదు



నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి గ్రామానికి ఏమీ చేయలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే అయినా మా బాధలు అర్థం చేసుకుని బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి. తాత్కాలిక మట్టి రోడ్డు దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నాం.

- సవరం రవి, నీటి సంఘం అధ్యక్షుడు

ఆరు నెలల క్రితమే బిల్లులు పెట్టాం

రెడ్డివారిపల్లె బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి సుమారు ఆరు నెలల క్రితం రూ. 5 కోట్లకు బిల్లులు పెట్టాం. ఇంత వరకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. బ్రిడ్జి పై వీరింగ్ కోట్ వేస్తే పాదచారులు వెళ్లే అవకాశం ఉంటుంది. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం

- జయప్రసాద్, డీఈ, రోడ్లు భవనాల శాఖ

ముగిసిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



ఊరేగుతున్న వెంకయ్యస్వామి

రైల్వేకోడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ప్రారంభమైన వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.భగవాన్ వెంకయ్య స్వామి జీవిత చరిత్ర పారాయణం చేశారు. స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, కోశాధికారి కారుమంచి చంద్రయ్య, ఉపాధ్యక్షుడు డిప్యూటీ తహసీల్దార్ గల్లా వెంకటరమణ, కార్యదర్శి జ్ఞానంగారి రఘురామయ్య, ఉప కార్యదర్శి చింతల శివకుమార్, సభ్యులు కొండేటి మోహనరంగయ్య, చీర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



చవితి ఉత్సవాలకు ముస్తాబైన కార్యసిద్ధి వినాయకస్వామి దేవాలయం

పెనగలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలకు ఇండ్లూరు, పి.కొత్తపల్లె గ్రామాల్లోని విఘ్నేశ్వరాలయాలు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు

భూ కబ్జాలను అరికట్టండి

సిద్దవటం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖరాజుపల్లి రెవెన్యూ సర్వే నంబరు 427/2లో 80 సెంట్ల ప్రభుత్వ స్థలం కబ్జా చేసి, కట్టడాలు నిర్మిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఎస్ ఆర్‌వి జయరామయ్య ఆదివారం ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ ఆ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆ గ్రామ వీఆర్వోకు ఆదేశించామని తెలిపారు. .

లంకమల అభయారణ్యంలో కూంబింగ్



కూంబింగ్ చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : లంకమల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం బీట్లలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించామన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం ఇతర దేశాలకు తరలకుండా కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్న విషయాన్ని ప్రతిఒక్కరు గ్రహించాలన్నారు. అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న పొలాల్లోకి వన్యప్రాణులు వెళితే ఎటువంటి హాని తలపెట్టకుండా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ బీట్ సహాయ బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట పెన్షనర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న పెన్షనర్ల సంఘం కార్యవర్గ సభ్యులు

రాజంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షులుగా మాజీ ఎన్జీవో సంఘ అధ్యక్షులు విశ్రాంత జిల్లా మలేరియా అధికారి లావలూరి శ్రీనివాసుల, అధ్యక్షుడుగా విశ్రాంత ఉపాధ్యాయుడు బి.వేణుపాల్‌నాయుడు, సహ అధ్యక్షులుగా ఎస్వీ రాజేశ్వర్‌రావు, ఎ.ఉదయ్ భాస్కర్‌రాజు, ఉపాధ్యక్షులుగా బి.నారాయణ, ఎస్.చెంగల్‌రాజు, ఇ.రామ చంద్రయ్య, కె.పోలయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.ఉమా మహేశ్వర్‌రావు, కార్యదర్శులుగా పి.అక్షిత, ఎస్.విజయకుమారి, ఎల్. చంద్ర య్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.సుబ్బనరసయ్య, కోశాధికారిగా ఎం.సత్య నారాయణ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి సేవలు అమోఘం



రవిశంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

నందలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ నాయకుడు రవి శంకర్ రెడ్డి సేవలు అమోఘమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కౌన్సిలర్ అల్లం అశోక్‌కుమార్ తెలిపారు. నందలూరు మండలం నుంచి పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన రవిశంకర్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, రాష్ట్ర ,జిల్లా మండల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు షఫీవుల్లా, కార్యదర్శి లీలాకృష్ణయ్య, జిల్లా నాయకులు మోహన్‌రాజు, మహేశ్వరబాబు, నరసింహారావు, వెంకటరమణ, ఓబుల్, సంధాని, సుష్మిత, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అన్నమయ్య జిల్లా 2025-27 నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించినట్లు ఆ సంఘం గౌరవాధ్య క్షుడు సుంకర రామకృష్ణ తెలిపారు. సంఘం అధ్యక్షుడుగా కానాల నాగముని, జనరల్ సెక్రటరీగా ఎం. శ్రీనివాసులు, ట్రెజరర్‌గా వెంకట్రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జయన్న, హెడ్ క్వార్టర్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంగాధర్, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, మహిళా ప్రతినిధులుగా డీ. చంద్రకళ, జీవీ సుధారాణి, రాయచోటి డివిజన్ అధ్యక్షులుగా బీ. రెడ్డెన్న, కార్యదర్శులుగా సురేంద్ర, మదనపల్లె డివిజన్ అధ్యక్షుడుగా మోహన్‌నాయుడు, కార్యదర్శిగా కే. రామచంద్ర, రాజంపేట డివిజన్ అధ్యక్షుడుగా రఘురాం, కార్యదర్శిగా సీవీ రమణయ్యశెట్టి, మున్సిపల్ కార్పొ రేషన్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా రఘు, లీగల్ కమిటీ సభ్యులుగా బీ. వెంకట్ర మణనాయక్, సదాశివారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులుగా బాలసంజీవ్, అమ్మనాయక్‌లను ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం జనరల్ సెక్రటరీ సురేశ్‌కుమార్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు.కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

'పోలీసులకు యోగా తప్పనిసరి '



యోగా శిబిరంలో కమాండెంట్ ఆనంద్‌రెడ్డి

సిద్దవటం, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి) : యోగా దినచర్యగా చేసుకుని పోలీసు సిబ్బంది సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని 11వ పోలీసు బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి కోరారు. మండలంలోని పోలీసు బెటాలియన్‌లో ఆదివారం ఉదయం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ పోలీసులు శారీరక దృఢత్వం, ఫిట్‌నెస్ పెంపునకు యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగనపల్లి వెంకటరమణకు సత్కారం



సన్మానం అందుకుంటున్న గంగనపల్లి వెంకటరమణ

నందలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించి నందుకు మండలం లోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం సత్కారం అందుకున్నారు. ఈనెల 29న తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా రాష్ట్రీ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) సీపీ బ్రౌన్ సమావేశ మందిరంలో ఆదివారం వేడుకలు నిర్వహించింది. పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మగడ్డ సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర, రాష్ట్ర బాధ్యులు రమేష్, శివారెడ్డి, నరసింహారెడ్డి, పద్మనాభయ్య, జిల్లా అధ్యక్షులు ఖాదర్, వైఎస్ఆర్ కడపజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు ఆయనను సన్మానించారు.

అన్ని దానాల్లో.. అన్నదానం మిన్న



ప్రేమాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రామాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని గడ్డం వెంకటశివారెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ బీదవాండ్లపల్లెకు చెందిన గడ్డం వెంకట శివారెడ్డి తన మేనత్త యర్రపురెడ్డి నాగులమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదానం చేశారు. వారి మేనల్లుడు వెంకటశివారెడ్డి, అల్లుడు రాంబసిరెడ్డి రాంబసిరెడ్డి, బాలనాగమ్మ, వెంకటసుబ్బమ్మ, గాయత్రి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

18 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు అర్హులను ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 18 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 18 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూప గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటికి చేరుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి



చర్చించుకుంటున్న బీసీ జనార్ధన్‌రెడ్డి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంట్ స్థాయి టీడీపీ సమావేశం నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదివారం రాయచోటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిశారు. అన్నమయ్య జిల్లా అభివృద్ధి, పాలనా వ్యవహారాలపై చర్చించుకున్నారు. సోమవారం స్థానిక సుధా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్ష ఎంపిక విషయంతోపాటు, జిల్లాల పునర్విభజన అంశాలను ప్రస్తావించడంతోపాటు , అన్ని నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చా ర్జిలతో పాటు నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించనున్నారు.

రాయుడుకాలనీలో వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అపర్ణ

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాయుడుకాలనీలో టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అపర్ణ హాస్పిటల్ వారిచే మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 200 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మడితాటి శ్రీనివాసులరెడ్డి మాట్లా డుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. అపర్ణ ఆసుపత్రి వైద్యులు అపర్ణ, సుజిత్ కుమార్ రెడ్డి వారి సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగానే మందులు అందజేశారన్నారు.

ఒంటిమిట్ట :మండల టీడీపీ నాయకులు కొమరా వెంకటనరసయ్య, పోలి సుబ్బారెడ్డి, మామిళ్ల ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, పోలి శివకిషోర్‌కుమార్ తదితరులు రాయచోటి ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి సన్మానించి, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు



రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ షరీఫ్

సుండుపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం పశు వైద్యశాలలో ఆదివారం సబ్సిడీ ధరపై జొన్న లు, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేసినట్లు రాయవరం సర్పంచ్ షరీఫ్ తెలిపారు. ఐదు కేజీల జొన్నలు రూ.90, మొక్క జొన్నలు రూ.120లకు రై తులకు అందజేయడం జరిగింద న్నారు. రాయవరం గ్రామ పంచాయతీకి 400 కేజీల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి యువకుడు రక్తదాత కావాలి



రక్తదానం చేస్తున్న యువకులు

సుండుపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి యువకుడు రక్తదాత కావాలని మండల విద్యా శాఖ అధికారి రవీంద్రనాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఒక మనిషి ఒక్కసారి రక్తదానం చేస్తే ఒక వ్యక్తి ప్రాణం కాపాడినట్టే అనే విషయాన్ని గ్రహించాలన్నారు. ప్ర మాదాలు జరిగినప్పుడు అత్యవసర సమయాల్లో రక్తం కొరతతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచిం చారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారి అయినా రక్త దానం చేయాలని కోరారు. 30 మంది యువకులు రక్తదానం చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ అహ్మద్, ఉపాధ్యాయులు హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజుకు సన్మానం




జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న రాజు విద్యాసంస్థల సిబ్బంది

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ని యోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన చమర్తి జగన్‌రాజును ఆదివారం రాజు విద్యాసంస్థల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్క రించి శుభాకాంక్షలు తెలియజే శారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పలువురు టీడీపీ నా యకులు, అభిమానులు, రాజు విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధవటం : రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజును ఆదివారం ఉదయం రాజంపేట టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ బీసీ నేత పుత్తా బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, నాయకులు పుత్తా విజయ్, పుత్తా సుధాకర్, గడ్డం శివరామకృష్ణయ్య, పోలచల్ల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నరెడ్డెప్ప

సుండుపల్లె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వెంటనే 12వ పీఆర్‌సీని నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటిం చాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ చిన్నరెడ్డెప్ప డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సుండుపల్లె ప్రాథమిక పాఠశాలలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన డీఏ, డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ పీఆర్‌సీ ప్రకటిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడిచినా బకాయిల చెల్లింపు విషయం పట్టించుకోవడం లేదన్నారు. 12వ పీఆర్‌సీతోపాటు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్రమణ, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే మృతి చెందిన బొప్పాయి కార్మికురాలు
- మరో ఇరువురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన వెంకటమ్మ

రైల్వేకోడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో బొప్పాయి కార్మికురాలు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ఇరువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే.. మండలంలోని సూరపు రాజుపల్లె క్రాస్ రోడ్డు ప్రధానదారికి పక్కనే ఉన్న సూరపురాజు పల్లె గిరిజనకాలనీ నుంచి రైల్వేకోడూరు వైపు మోటారుసైకిల్‌లో మహేష్, వీరయ్య, వెంకటమ్మ వెళుతుండగా తిరుపతి నుంచి రైల్వేకోడూరు వైపు వెళుతున్న ఓ కారు వెనక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటమ్మ (30) అక్కడికి అక్కడే మృతి చెందగా మహేష్, వీరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురూ బొప్పాయి కూలీలు. వీరు చిట్వేలి మండలం చింతల చెలిక గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కలకడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ముల్లగూరి సోమశేఖర్ (54) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగాపురం పంచాయతీ రంగప్పగారిపల్లికి చెందిన సోమశేఖర్‌కు తన చెల్లెలుతో భూ సమస్యలు వున్నట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సోమశేఖర్ శనివారం ఉదయం పొలం వద్ద విష ద్రావణం తాగి అపస్మారక స్థితిలో వుండగా గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి


హనుమంతు మృతదేహం

పీలేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో హనుమంతు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19వ తేదీన పీలేరు రైల్వే స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. కాస్త కోలుకున్నాక తనది అనంతపురం జిల్లా ఉరవకొండ అని తెలిపాడని, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9440764744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

ఉరి వేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతి చెందిన ఉమ్మడి శెట్టి లక్ష్మీప్రసాద్ ఫైల్ ఫోటో


ప్రొద్దుటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వసంతపేటకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శనివారం రాత్రి మేడ పైన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్‌కు రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లకు చెందిన చంద్రకళా అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగినితో వివాహమైంది. పెళ్లైన వారం రోజులకే దంపతుల మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా కాపురం వుంటున్నారు. ఇటీవల లక్ష్మీప్రసాద్‌కు కిడ్నీ సమస్య వచ్చింది. దీనికితోడు భార్య సమస్య కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాదులోని తన ఇంటిలో శనివారం రాత్రి భోజనం అయ్యాక మేడపైన నిద్రపోవడానికి వెళ్లాడు. తండ్రి వెంకటసుబ్బన్న మేడపైకి వెళ్లి చూసేసరికి తలుపులు వేసి వున్నాడు. కిటికీలో నుండి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనపడ్డాడు. దీంతో వెంటనే లక్ష్మీప్రసాద్‌ను కిందకి దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి : ఒకరికి గాయాలు


గాయపడిన నాగరాజు

కమలాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో స్నేహితుల మధ్య మాటామాట పెరిగి గొడవకు దారి తీసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చదిపిరాళ్ల గ్రామానికి చెందిన శివారెడ్డికి వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి రూ.4500 బాకీ ఉన్నాడు. ఆ డబ్బు సోమవారం ఇస్తానని చెప్పేందుకు ఆదివారం గోవర్ధన్‌రెడ్డి రామచంద్రాపురం వద్ద ఉన్న శివారెడ్డి ఎద్దుల షెడ్డు వద్దకు వెళ్లాడు. తనకు అవసరం ఉందని, వెంటనే బాకీ ఇవ్వాలని శివారెడ్డి కోరాడు. ఇంతలో వల్లూరు మండలం కట్ట గ్రామానికి చెందిన ఆది నాగరాజు, వినోద్, చరణ్‌తేజ్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకున్నారు. ఏం జరిగిందో తెలియదు... స్నేహితులైన గోవర్ధన్‌రెడ్డి, నాగరాజుల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగరాజు మెడపై కత్తి పోట్లు కావడంతో గాయాలయ్యాయి. అక్కడున్న వారు సర్దిచెప్పి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారించి, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ


చోరీకి గురైన బైక్

సిద్దవటం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి బాకరాపేట ప్రాంతంలోని కాశినాయన గుడి సమీపాన ద్విచక్ర వాహనం చోరీ గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైతు వెంకటసుబ్బారెడ్డి ఆదివారం సాయంత్రం కాశినా యన గుడి సమీపాన ఉన్న తన పొలం వద్ద ద్విచక్ర వాహనం నిలిపి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం చోరీ గురైందని రైతు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా ఈ చోరీపై విచారణ చేపట్టామన్నారు.

పాత బిల్లులకు మోక్షం ఎప్పుడో..?

- కలగా మరిన పాత బిల్లుల మంజూరు
- ఏడు సంవత్సరాలుగా తెలుగు తమ్ముళ్ల ఎదురుచూపులు
- మొత్తం రూ.10 కోట్ల మేరకు పెండింగ్‌లోనే..
- బిల్లుల మంజూరు కోసం మంత్రి ప్రత్యేక చొరవ


నూలివీడులో బిల్లులకు నోచుకోని డంపింగ్ యార్డు

గాలివీడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న 2014-19 మధ్యకాలంలో గ్రామాల్లోని టీడీపీ నాయకులు లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డంపింగ్ యార్డులు, ఫార్మేషన్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, చెక్‌డ్యాంల మరమ్మతులు, కొత్త చెక్‌డ్యాంల నిర్మాణాలు కల్లాలు (పంట మార్పులు), పాఠశాలల దగ్గర ఆట స్థలాలు వంటి పనులను ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టేసింది. దీంతో అప్పులు చేసి పనులు చేసిన టీడీపీ నాయకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఏడు సంవత్సరాలుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించుకోలేక నరక యాతన అనుభవిస్తున్నారు. టీడీపీ నాయకులు చేసిన పనులకు అప్పటి వైసీపీ నాయకులు బిల్లులు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసి బిల్లులు రాని టీడీపీ నాయకుల కోసం అప్పట్లో చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లించి పనులు చేసిన వాళ్లను ఆదుకుంటామని ప్రతి మీటింగ్‌లోనూ చెబుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ బిల్లులకు మోక్షం కలగలేదు. ఒక్క నీరు-చెట్టు బిల్లులు తప్ప ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించలేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు. అయితే గత వారం క్రితం పెండింగ్ బిల్లులకు సంబంధించి ఒక జాబితా సీఆర్‌డీపీ నుంచి మండల స్థాయి అధికారులకు వచ్చింది. ఆ జాబితాతో కేవలం రూ.7 వేలు మాత్రమే విత్‌డ్రా అమౌంట్ వచ్చినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో నాడు ఉపాధి హామీ నిధులతో రూ.10 కోట్ల మేర వివిధ రకాల అభివృద్ధి పనులను టీడీపీ నా యకులు చేశారు. అందులో ఆగస్టులో రూ.3కోట్ల 80లక్షల పనులు చేసిన వారి అకౌంట్లలో జమ అయింది. విషయం తెలుసుకొన్న వైసీపీ నాయకులు దురుద్దేశంతో జిల్లా స్థాయి ఉపాధి అధికారులతో ఒత్తిడి చేయించి డబ్బులు పడిన వారి అకౌంట్లను డ్రా చేయనీయకుండా బ్లాక్ చేయించారు. దీంతో వీరు ఇప్పటికీ డబ్బులను డ్రా చేసుకోలేకపో యారు. మండలంలోని గాలివీడులోని ఎస్‌బీఐలో బిల్లులకు సంబంధించిన డబ్బులనే కాకుండా అంతకు ముందు ఉన్న డబ్బులను కూడా డ్రా చేసుకోలేకుండా పోతున్నామని బ్లాక్ చేసిన అకౌంట్‌దారులు వాపోతున్నారు. సీసీపల్లె పంచాయతీ నల్లగుండ్లపల్లెకు చెందిన ఒక వ్యక్తికి చెందిన అకౌంట్‌లో ఆగస్టు 2022లో రూ.2 లక్షల మేర బిల్లులు జమ కావడం జరిగిందని, వెంటనే తన అకౌంట్‌ను బ్లాక్ చేశారని, అంతకు ముందు తన అకౌంట్‌లో ఉన్న డబ్బులను కూడా ఇప్పటికీ విత్‌డ్రా చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.70 లక్షలు బిల్లులు అకౌంట్‌లో జమ కావడంతో ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయడం జరిగిందని ఎగువ గొట్టివీడుకు చెందిన మరొక బాధితుడు తెలిపారు. నూలివీడులోని ఏపీజీబీ, గాలివీడులోని ఏపీజీబీ, కార్పొరేషన్ బ్యాంకుల అకౌంట్లలో పడిన బిల్లులను మరుసటిరోజే అప్పటి జిల్లా అధికారులు తిరిగి వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని, ఆ డబ్బులను కూడా ఇంతవరకు తిరిగి అకౌంట్‌లో జమ చేయలేదని మరికొంత మంది వాపోయారు. మొత్తం 4 బ్యాంకుల్లో వంద మందికిపైన టీడీపీ వారికి సంబంధించి రూ.3 కోట్ల 80 లక్షల వరకు డ్రా చేసుకోకుండా నిలుపుదల చేశారన్నారు. ఇవేకాకుండా 2017-19 మధ్యకాలంలో డంపింగ్ యార్డు, ఫార్మేషన్ రోడ్లు, కల్లాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు వంటివి ఉపాధి హామీ నిధులతో చేపట్టారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీరు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఐడీ నెంబర్లను, పీటీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లను కూడా బ్లాక్‌లో పెట్టి వైసీపీ నాయకులు అడ్డుకున్నారని తెలిపారు. నూలివీడు పంచాయతీలో 2018సెప్టెంబర్‌లో డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపట్టామని, 24-12-2018 నాటికి ఆ పనులను పూర్తి చేశామని, ఈ పనికి సంబంధించి వర్క్ ఐడీ నెంబర్ 1111535004004171029 అని, ఎంబుక్ నెంబర్ 025/54 అని, ఈ పనికి సంబంధించి ఆనాడు రూ.4,56,197 ఎఫ్‌టీవోను కూడా చేశారని, కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా రాలేదని మరో బాధితుడు పేర్కొన్నారు. కానీ వారం క్రితం ఈ డంపింగ్ యార్డుకు సంబంధించి కేవలం రూ.28,877 మాత్రమే నిధులను విడుదల చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పెండింగ్ బిల్లులు మండల వ్యాప్తంగా రూ.5 కోట్ల మేర ఉన్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బ్లాక్ చేసిన అకౌంట్లు తిరిగి ఓపెన్ చేయించి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించడానికి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించడానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఏది ఏమైనా పెండింగ్ బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎంపీడీవో వివరణ

మండలంలో 2017-19 మధ్యకాలంలో చేసిన కొన్ని పనులకు సంబంధించి బ్యాంకు అకౌంట్లను బ్లాక్ చేసిన మాట నిజమే నని, ఈ పనిని అప్పటి అధికారులు చేశారని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ తెలిపారు. ఇంకా కొన్ని పనులకు సంబంధించి ప్రభుత్వం విత్‌డ్రా అమౌంట్ వచ్చిందని, దీంతో పాటు ఇంకా కొన్ని పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వీటికి సంబంధించి సీఆర్‌డీపీ అధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

ఘనంగా గోవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె సాయినేత్రికారెడ్డి, అల్లుడు దుర్గామహేశ్వరరెడ్డిల వివాహ రిసెప్షన్ ఆదివారం నగరంలోని మాధవి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర భవనాలు, రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, మాజీ మంత్రి అంజాద్‌బాషా, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, కృష్ణచైతన్యరెడ్డి, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎమ్మెల్యేలు వీరశివారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం, మేడా మధుసూదన్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఉక్కు ప్రవీణ్, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, సాయినాథ్ శర్మ, టీడీపీ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు దంపతులను ఆశీర్వదించారు.

జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా

చంద్రశేఖర్‌రావు ఎన్నిక



జమ్మలమడుగు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణానికి చెందిన డి.చంద్రశేఖర్‌రావు ఆదివారం కడప జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఎన్నికయ్యారు. కడపలో జరిగిన కార్యవర్గ ఎన్నికలో తనను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆగస్టు 2023 జరిగిన కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అప్పట్లో ఎన్నిక కాగా ఈ ఆదివారం రెండవసారి ఎన్నికైనట్లు వివరించారు. ఈయన జమ్మలమడుగులో మండల విద్యాశాఖాధికారిగా ఉన్నారు. కాగా జిల్లా అధ్యక్షుడిగా జి.వి.సుబ్బారెడ్డి (బద్వేలు), కోశాధికారిగా శ్రీనివాసరెడ్డి (హెచ్ఎం, పెన్నానగర్, ప్రొద్దుటూరు), జమ్మలమడుగు డివిజన్ వైస్‌ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణరెడ్డి (హెచ్ఎం, లక్ష్మిపేట), జిల్లా జాయింట్ సెక్రటరీగా జి.బాలయ్య (హెచ్ఎం, వేపరాల), రాష్ట్ర కౌన్సిల్‌గా ఎన్.లక్ష్మినారాయణరెడ్డి (జడ్పీహెచ్ఎస్, తొండలదిన్నె)లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసు రక్షణ కోరిన ప్రేమజంట


పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రేమజంట

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రేమజంట ఆదివారం తాలుకా పోలీసులను ఆశ్రయించారు. మదనపల్లె మండలం కొత్తపల్లె గ్రామం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన హేమంత్ నాయక్, నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన గాయత్రి ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని, రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి మదనపల్లె పట్టణ శివారులోని ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. ఈ మేరకు పెద్దల నుంచి రక్షణ కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరూ మేజరు కావడంతో రక్షణ కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు డీడీలు కూడా చెల్లుబాటు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

మదనపల్లె టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 11 బార్లకు నిర్వహించనున్న లక్కీ డ్రాలో పాల్గొనేవారు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు ఇవ్వవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తులకు, ఆన్‌లైన్‌లోనే డిపాజిట్లు, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే ఆఫ్‌లైన్ దరఖాస్తులకైతే డీడీ ద్వారా డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలకు పూర్తి చేసిన దరఖాస్తులను రాయచోటిలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందించాలని ఆయన తెలిపారు.

కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ దారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కానీ అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

రైల్వేకోడూరును అభివృద్ధి చేసి చూపిస్తా

- ముక్కా సమక్షంలో టీడీపీలో చేరిన 200 వైసీపీ కుటుంబాలు


ముక్కా సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని బొజ్జావారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన 200 మంది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఇప్పటికే సుమారు రూ.80 కోట్ల మేరకు వివిధ రకాల అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. రైల్వేకోడూరులో త్వరలో అన్నా క్యాంటిన్ ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిల సారధ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని తెలిపారు. అనంతరం దాదివారిపల్లె, దళితవాడ, వడ్డిపల్లె గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు నందలూరు సుబ్రహ్మణ్యంరెడ్డి అలియాస్ చిట్టి ఆధ్వర్యంలో 35 కుటుంబాలు, నందలూరు శ్రీనివాసులురెడ్డి, చిన్నపోలు జయరామిరెడ్డి, నందలూరు సుబ్బరామిరెడ్డి, జోగి పట్టాభిరెడ్డి, సింగమాల వెంకటరెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో 165 కుటుంబాలు ముక్కా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మ : తులసిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించాలని వైసీపీ నిర్ణయించడం ద్వారా జగన్ నిజస్వరూపం మరోసారి బహిర్గతమైందని, బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మగా మారారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ చేతిలో జగన్ కీలు బొమ్మ అని మరోసారి రుజువైందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ ప్రభుత్వం బలపర్చిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టీడీపీ, జనసేన, వైసీపీ నిర్ణయించడం చాలా దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో కుస్తీ, హస్తినలో దోస్తీ అన్నట్లుగా వైసీపీ, టీడీపీల లాలూచీ వ్యవహారం ఉందన్నారు. బాబుకు ఓటేసినా, బీజేపీకి ఓటేసినట్లే, జనసేనకు ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే, జగన్ పార్టీకి ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లే అనే ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, సీనియర్ నాయకుడు ఎస్ఎండీ గౌస్, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్‌రఫీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పొలం వద్ద ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఆదివారం ఉదయం ఇంట్లో దూరి కర్రలతో కొంతమంది కలిసి వ్యక్తిని గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. దొనబైలుకు చెందిన వై. నాగరాజ (45) పొలం విషయమై తన దాయాదులైన మల్లికార్జున, చంద్ర, విశ్వనాథ్‌లు గొడవ పడగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో కర్రలతో దాడి చేసి నాగరాజను గాయపర్చారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


జిల్లా జూనియర్ షూటింగ్‌బాల్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం అన్నమయ్య జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ బాల, బాలికల జిల్లా జట్లు ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు వంద మంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారు సెప్టెంబర్‌లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో రాణించి జిల్లాకు ప్రథమ స్థానం తీసుకురావాలని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్‌అక్బరీ కోరారు. కార్యక్రమంలో యూసుఫ్, అసోసియేషన్ సభ్యులు భారతి, మదనపల్లె మండల స్కూల్ గెస్ట్ కో-ఆర్డినేటర్ శివశంకర్, సెలెక్షన్ కమిటీ కుమార్‌నాయక్, జయంత్, తిరుమలేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే రాహుల్ పోరాటం



కూడలిలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పీలేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ పోరాడుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బాలిరెడ్డి సోమశేఖర రెడ్డి పేర్కొన్నారు. పీసీసీ పిలుపు మేరకు ఆదివారం కాంగ్రెస్ పీలేరు అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్ ఆధ్వర్యంలో 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్రంగా పనిచేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా బీజేపీ జేబు సంస్థగా మారిందన్నారు. దాదాపు 65 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో బయటపెట్టినా కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఓటు చోరీపై స్పష్టత వచ్చే వరకు తాము ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. అనంతరం కూడలిలోని మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకుమునుపు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నియోజక వర్గంలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఎన్ఎస్‌యూఐ శ్రేణులు

'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' పేరిట కేంద్ర ప్రభుత్వం సహా కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి సంఘీభావంగా ఆదివారం రాత్రి ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు చేతబూని కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ మాట్లాడుతూ ఓట్ల దొంగతనంపై రాహుల్ గాంధీ లేవనెత్తిన అభ్యంతరాల పట్ల కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం సరైన సమాధానం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నేతలు యూసుఫ్, సాయి సంపత్, లోకేశ్, గురు, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హైవేపై కాంతులెప్పుడో ?

అలంకారప్రాయంగా లైట్లు ● పట్టించుకోని హైవే అధికారులు

భయం గుప్పిట్లో మహిళలు

గుర్రంకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి రద్దీ తగ్గించేందుకు ఏర్పాటు చేసిన హైవేపై చీకటి పడిందంటే ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. డబుల్ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఎల్ఈడీ లైట్లను అమర్చినా ఎల్ఈడీ లైట్లు మాత్రం వెలగడంలేదు. వివరాల్లోకెళితే....

పట్టణం మీదుగా కడప-బెంగుళూరు జాతీయ రహదారి ఉంది. ఈ మార్గంలో వాహనాల రద్దీగా అధికంగా ఉండడంతో హైవేని ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు పనులు కూడా ఏళ్లతరబడి చేయడంతో పట్టణంలో పూర్తి స్థాయిలో పనులు పూర్తికాలేదు. పట్టణంలో హైవే కాస్తా డబుల్ రోడ్డుగానే ఉంది. ఈ రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణీకులు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో కొన్ని చోట్ల పాత రోడ్డంత వెడల్పు రోడ్డు కూడా లేకపోయింది. వాహనదారులు స్పీడ్ కంట్రోల్ చేయలేక దుకాణాల్లోకి దూసుకెళ్లి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అంతేకాకుండా ఊరు బయట రోడ్డు వెడల్పు చూసి అలానే పట్టణంలో రోడ్డు ఉంటుందని వాహనాలు అతివేగం వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. రాయచోటి నుంచి అంగళ్లు వరకు ఉన్న చిన్న మండల కేంద్రాలో సైతం రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ డివైడర్ల మధ్యలో ఇనుప స్తంభాలను ఏర్పాటు చేసి ఎల్ఈడీ లైట్లను అమర్చి వెలుగులను నింపారు. గుర్రంకొండలో మాత్రం రోడ్డు రూపురేఖలు మారలేదు. డబుల్ రోడ్డుకు ఇరువైపులా ఇనుప స్తంభాలను ఏర్పాటు చేసి ఎల్ఈడీ లైట్లను పోలీస్ స్టేషన్ నుంచి మార్కెట్ యార్డు వరకు నాలుగు నెలల కిందటే బిగించారు. నెలలు గడుస్తున్నా ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. దీంతో గుర్రంకొండ పట్టణం సాయంత్రమైతే అంధకారంలో చిక్కుకుంటోంది.

మహిళలకు తప్పని భయం

పట్టణంలో సాయంత్రం ఆరు గంటల తరువాత బస్‌స్టాండు ప్రాంతంలో మహిళలు నిలబడాలంటే ఆందోళన చెందుతున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వరకు విద్యుత్ స్తంభాలకు ఉన్న పాత వీధిలైట్లు వెలగడం లేదు. ఈ ప్రాంతం సాయంత్రం కాగానే పూర్తిగా చీకటితో నిండి మారుమూల పల్లె ప్రాంతంగా మారుతుంది. మహిళలు కనీసం నిత్యావసరాల కోసం బస్‌స్టాండుకు రావాలంటే చీకట్లో ఎక్కడ అల్లరి, అకతాయి మూకలు ఇబ్బందిపెడతారోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో చైన్ స్నాచింగ్‌లు అధికంగా జరిగాయి. వీరికి తోడు గంజాయి బ్యాచ్‌లు ఉండడంతో మహిళా ప్రయాణీకులు, మహిళలు, పిల్లలు హడలిపోతున్నారు.

లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం

పట్టణంలో హైవేపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు వెలిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇందు కోసం పంచాయతీ అధికారులతో మాట్లాడి కరెంట్ మీటర్ ఏర్పాటు చేసి వీలైనంత తొందరగా ఎల్ఈడీ లైట్లు వెలిగేలా చూస్తాం.

మంజుల, ఎన్‌హెచ్ ఏఈ

ఒంటరిగా ఉండాలంటే కష్టం



బస్‌స్టాండులో మహిళలు ఒంటరిగా ఉండాలంటే చాలా కష్టంగా ఉంటోంది. ఈ ప్రాంతం చీకటిగా ఉండడంతో దుకాణాల వద్ద నిలబడాల్సివస్తోంది. దుకాణాలు మూసివేస్తే ఇబ్బందిగా మరకరితో కలిసి ఉండి బస్సులు ఎక్కుతున్నారు. బస్ స్టాండులో మహిళలు కూర్చోడానికి కనీసం వసతులు లేవు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తే మహిళలకు సౌకర్యాంగా ఉంటుంది.

రాధిక, గుర్రంకొండ

గుర్రంకొండలో హైవేకి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు



బస్ స్టాండులో అల్లరి మూకలు...



బస్ స్టాండులో అకతాయి బ్యాచ్‌లు బెంచ్‌లపై గుంపులుగా ఉంటారు. మహిళలు ఉండాలంటే భయంగా ఉంటుంది. ఎక్కడా వెలుతురు ఉండదు. వివిధ కార్యాలయాల్లో పని చేసి సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు బస్‌స్టాండుకు వచ్చే మహిళలకు ఇబ్బంది కరమే. ఒంటరిగా నిలబడాలంటే ప్రాణం బిక్కుబిక్కు మంటోంది. అధికారులు బస్‌స్టాండులో లైట్లు వెలిగిస్తే చాలా బాగుంటుంది.

గయాజ్, గుర్రంకొండ

కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ

రూ.7.64 కోట్లతో కోసువారిపల్లె రోడ్డు నిర్మాణం ● అంకిరెడ్డిపల్లె రోడ్డుకు రూ.3.71 కోట్ల నిధులు మంజూరు

30ఏళ్ల కలను సాకారం చేస్తున్న కూటమి ప్రభుత్వం ● భూమి పూజ చేసిన టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి కూటమి నేతలతో కలిసి పలు ప్రాంతాల్లో రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. 30 ఏళ్ల కలను ప్రభుత్వం సాకారం చేస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. ములకలచెరువు మండలం గూడుపల్లె క్రాస్ నుంచి కాల్వపల్లె వరకు రూ.5.54 కోట్లు, కాల్వపల్లె నుంచి చౌడసముద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.7.03 కోట్లు విడుదలవడంతో ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా గుంతలమయమైన రెండు తారురోడ్లను తొడేసి కొత్తగా రోడ్లు వేసేందుకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. రెండు నెలల్లోగా రోడ్ల పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, మూగి రవిచంద్ర, నేతలు చాంద్‌బాషా, మస్తాన్‌రెడ్డి, గాలి నారాయణ, సుబ్బినాయుడు, కృష్ణమూర్తి, మస్తాన్‌సాబ్, బుర్రా రమణ, జనార్ధన్‌రెడ్డితో పాటు కాంట్రాక్టర్ కృష్ణమోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గూడుపల్లెలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

రూ.7.64 కోట్లతో కోసువారిపల్లె రోడ్డు

తంబళ్లపల్లె, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ వచ్చిందని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. తంబళ్లపల్లెలో కూటమి నేతలతో కలిసి తంబళ్లపల్లె నుంచి కోసువారిపల్లె వరకు రూ.7.64 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు శంకు స్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కోసువారి పల్లె రోడ్డు నిర్మాణంతో 15 గ్రామాల రైతులు, విద్యార్థులు, ప్రజల కష్టాలు తీరతాయన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, సోముశేఖర్, పెద్దేరు చైర్మన్ శివ, పురుషోత్తం, వీరాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామ చంద్ర, ఉత్తమ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గ్రామాధ్యక్షులు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లె రోడ్డుకు భూమిపూజ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పీటీఎం నుంచి అంకిరెడ్డిపల్లె మీదుగా బెట్టకొండ వరకు రోడ్డు నిర్మాణ పనులకు టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఆదివారం ఉదయం ఆయనకు కూటమి నేతలు పీటీఎంలో ఘనస్వాగతం పలికా రు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మండలంలోని వివిధ గ్రామీణ రోడ్లకు నిధులు మం జూరయ్యాయి. వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లుకు కనీసం తట్టెడు మట్టిని కూడా వేయలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రోడ్ల దశ మారిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ విజయమోహన్, ఏఈ నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ తమక శంకర, టీడీపీ నేతలు కట్టా సురేంద్రనాయుడు, కాంట్రాక్టర్ చక్రధర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, క్లస్టర్ ఇన్‌చార్జ్ బందార్లపెద్దవెంకట్రమణ, మాజీ ఎంపీటీసీ సూరి, బూర్లపల్లె మేకల సుధాకర్‌రెడ్డి, పెద్దచెరువు సంఘం అధ్యక్షుడు వెంట్రమణారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, ఎగువపల్లె రామచంద్ర, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, మద్దయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ నరసింహులు, కుమ్మరవారిపల్లె రాజేష్, పకృద్దీన్, భజంత్రీ రామచంద్ర, కార్యం సుబ్రమణ్యం, నందిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి కర్ణాటక, కడప, తిరుపతి, బయట ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకుని కొబ్బరి కాయలను సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ పునరుద్ధరించాలి

పీలేరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సీపీఎస్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం) రద్దు చేసే వరకూ తమ పోరాటం ఆగదని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏలు ఇవ్వాలని, పీఆర్‌సీ, మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ నేతలు కిషోర్‌కుమార్, అమర్‌నాథ్, ఎర్రయ్య, ఈశ్వరయ్య, జయప్రకాష్, విజయకుమార్, జోహర్, యాసిన్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సురవరం సేవలు చిరస్మరణీయం


సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) అగ్రనేత, కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి, ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, ఆదివారం బాస్ కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమాన్ని వీసీకే పార్టీ, బాస్ సంయుక్తంగా నిర్వహించాయి. కామ్రేడ్ సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర అధ్యక్షుడు యు.గణపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాలమోహన్, నీరుగట్టి రమణ, వి.దొరస్వామి, బయన్న, రెడ్డెప్ప, డేగాని రమణ, జి.వి.రమణ, రవిశంకర్, గంగాధర్, రవి, కృష్ణ, శ్రీనివాసులు, వినోద్, గోపీ, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌గా షామీర్‌బాష

మదనపల్లె, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రెస్‌క్లబ్ కన్వీనర్‌గా సీనియర్ జర్నలిస్టు టి.షామీర్ బాషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో పాత్రికేయులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రెస్‌క్లబ్ పాలకవర్గం పదవీకాలం జూన్ 12వ తేదీతో ముగిసింది. తిరిగి రెండేళ్ల కాలవ్యవధితో డిసెంబర్ మొదటివారంలో నిర్వహించే ఎన్నికల వరకూ కన్వీనర్‌గా షామీర్‌బాషా కొనసాగనున్నారు. ఏపీయూడబ్ల్యూజే మాజీ ఉపప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండపల్లె అక్కులప్ప, జిల్లా కార్యదర్శి ఎస్.వంశీధర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్, శ్రీనివాస్‌గౌడ్, శివా రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

11మంది జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అగ్రహారం, నిమ్మనపల్లి పంచాయతీ కొత్తపల్లిలో రెండు చోట్ల పేకాడుతున్న మొత్తం 11మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.11,300లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. అగ్రహారం వద్ద పేకాడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.6200లను, కొత్తపల్లి వద్ద పేకాడుతున్న ఐదుగురిని పట్టుకుని రూ.5100లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రామసముద్రం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేసీపల్లె జడ్పీ హైస్కూల్‌లో 2014-15లో చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదేళ్ల తర్వాత తిరిగి ఈ పాఠశాలను గుర్తు పెట్టుకుని విద్య నేర్పిన గురువులకు సత్కారం చేయడం సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు తాగునీటి శుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమణారెడ్డి, దామోదర్, లీలావతమ్మ, శైలజకుమారి, భారతి, వేణు, మాధవి, చంద్రశేఖర్, రెడ్డెప్ప, శారదమ్మ, వెంకటరత్నమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీటీఎం రోడ్డు, తిరుపతి వైపు వెళ్లే రోడ్డులో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆదేశాల మేరకు ట్రాఫిక్ మళ్లింపు ఉందని ట్రాఫిక్ సీఐ గురునాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్న కారణంగా ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా తిరుపతి, వాయల్పాడు, కలికిరి, రోడ్డులో వెళ్లే బస్సులను జడ్పీ హైస్కూల్, సంతగేటు, బెంగళూరు బస్టాండ్, కదిరి రోడ్డు, నీరుగట్టువారిపల్లె, అన్నమయ్య సర్కిల్, బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించినట్లు చెప్పారు. తిరుపతి నుంచి పట్టణంలోకి వచ్చేబస్సులు తట్టివారిపల్లె మీదుగా కాకుండా వెంగమాంబ సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్, నీరుగట్టువారిపల్లె, కదిరి రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయని తెలిపారు. ప్రజలు, ప్రయాణీకులు ఈ మార్పును గమనించాలని కోరారు.

రైతుకు పాము కాటు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పొలంలో పనులు చేస్తున్న లక్ష్మీపతి పాము కాటుకు గురయ్యాడు. ఆదివారం కోళ్లబైలు పంచాయతీ, మిట్టామర్రి వాసి లక్ష్మీపతి పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ఆయన చికిత్స పొందుతున్నాడు.

హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్‌గా గంగాధరం


గంగాధరం


వై సురేంద్ర


వై.వెంకటరమణ

పీలేరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్‌గా పీలేరు వాసి తాటిపర్తి గంగాధరం ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. జంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయనను రాయచోటిలో ఆదివారం అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నిక చేశారు. అంతేకాకుండా పీలేరు మండలం మేళ్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.సురేంద్ర రాయచోటి డివిజన్ కార్యదర్శిగా, కేవీపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.వెంకటరమణ జిల్లా కోశాధికారిగా ఎన్నికయ్యారు. కార్యవ ర్గ సభ్యులుగా ఎన్నికైన వీరిని పలువురు అభినందించారు.

ముగిసిన మేధా యోగా



మదనపల్లె అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నవోదయ పాఠశాల్లో మేధాయోగా ముగిసినట్లు ఆ పాఠశాల ప్రధానాచార్యులు గీత తెలిపారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నవోదయ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానాచార్యులు మాట్లాడుతూ మానవ జీవన వికాసానికి, ఉత్తమ దైనందిన జీవన విధానానికి యోగా ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచడానికి, ఒత్తిడి తగ్గించుకునే సామర్థ్యాన్ని విద్యా సంబంధ పనితీరును మెరుగుపరుచుకోవడానికి మెదుడుకు యోగా సహాయపడుతుందన్నారు. మానసిక ఉల్లాసం కలిగించే కార్యక్రమాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు తుమరాడ అరుణకుమారి, విజయలక్ష్మీ, యోగా అధ్యాపకులు సందీప్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో నవోదయ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు లేనట్టేనా?

● నోటీసులు జారీచేసినా ఫలితం శూన్యం


ఆక్రమణలకు గురైన నిమ్మనపల్లి బస్ స్టాండు

నిమ్మనపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్ స్టాండులో ఆక్రమణలను తొలగించేందుకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమణ దారులు నోటీసులు జారీ చేసినా ఫలితం కనిపించలేదు. దాదాపు 50కి పైగా దుకాణాల వద్ద ఆక్రమణలుండగా కేవలం 24మందికి మాత్రమే నోటీసులు ఇచ్చారు. దీంతో ప్రజలు బస్ స్టాండులో వున్న ఆక్రమణలను తొలగిస్తారని ఎదురు చూశారు. అయితే ముందుగా రోడ్డు పక్కన వున్న చింత చెట్లు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ఉపక్రమించగా కొత్తపల్లికి చెందిన కొందరు చింత చెట్లు తమవని తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని చెట్ల ను కోసేందుకు నిరాకరించారు. దీంతో ఆక్రమణల తొలగిం పు ప్రశ్నార్థకంగా మారింది. కొందరు దుకాణదారులు నేతల వద్దకు వెళ్లడంతో వారి ఆదేశాల మేరకే ఆక్రమణలను తొల గింపు అడ్డుకున్నారని తెలుస్తోంది. కాగా రోడ్డుకు ఇరువైపు లా ఆటోలు, ద్విచక్రవాహనాల పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అతంరాయం కలిగిస్తున్నారు. వారపుసంత రోజు అయితే ట్రాఫిక్ ఇరుక్కున్న వాహనాలు కదిలేపరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు కొత్తగా రూముల నిర్మించుకునే వారు రోడ్డుపైనే మట్టి, ఇసుక, రాళ్లను తోలడంతో ట్రాఫిక్ మరింత దారుణంగా తయారైంది. కాగా బస్ స్టాండులో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దాదాపు 30 ఏళ్లు కావస్తుంటే ప్రస్తుతం పూలమాల వేయాలంటే దారి లేకుండా తోపుడు బండ్లు వెలిశాయి. పైగా చింతచెట్ల కిందే చికెన్, మటన్ మార్కెట్లను ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్ స్టాండ్‌లో ఆక్రమణలు తొలగింపు లేనట్లుగానే కనిపిస్తోంది. ఇదే జరిగితే ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించం : సీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే గణేష్ ఉత్సవాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించమని అర్బన్ సీఐ యుగంధర్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం పీలేరు పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటీలతో ఆయన మాట్లాడుతూ 27వ తేదీ నుంచి పట్టణంలో సుమారు వంద ప్రాంతాలకు పైగా ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. అయితే ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉండరాదని, అంతా పోలీస్‌శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. వర్గ విభేదాలకు తావివ్వరాదని, ఉద్రిక్తతలకు తావిస్తే సంబంధిత కమిటీ నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకోవాలంటే ముందస్తుగా పోలీస్ అనుమతి తప్పని సరన్నారు. బాణసంచా, డీజే డ్యాన్సులు, హిజ్రాలతో డ్యాన్స్‌లు అనుమతించబోమన్నారు. సమష్టి కృషితో ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ ఉత్సవ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, సుధాకర్, సుదర్శన్ రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్ర స్వామి, కృపాల్, బీజేపీ చంద్రశేఖర్ రెడ్డి, రేవూరి సుధీర్, శశిధర్ రెడ్డి, తదితరులు, నిర్వాహకులు పాల్గొన్నారు.